
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.5 , కనిష్ఠం 23.6





ఐకేపీ వీఓల ఉద్యమబాట

- ఆందోళనకు సిద్ధమవుతున్న వీఓఏలు
- స్త్రీనిధి రుణాల వడ్డీ ఇన్సెంటివ్ చెల్లించాలంటూ డిమాండ్
- ఏడు సంవత్సరాల బకాయిలపై నిరసన
- జిల్లాను నాలుగేళ్ల నుంచి స్టేట్‌టాప్‌గా నిలుపుతున్నా పట్టించుకోవడం లేదని అసంతృప్తి

నిర్మల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఐకేపీలో వీఓ సభ్యులతో పాటు వీఓఏలు ఉద్యమబాటకు సిద్ధమవుతున్నారు. గత ఏడు సంవత్సరాల నుంచి స్త్రీనిధి రుణాలకు సంబంధించిన వడ్డీ డబ్బులు గానీ ఇన్సెంటివ్‌ను గానీ ప్రభుత్వం విడుదల చేయకపోవడం పట్ల వీరంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా జిల్లాను స్త్రీనిధి రుణాల రికవరీలో తామంతా రాష్ట్రంలోనే మొదటి వరుసలో నిలుపుతున్నప్పటికీ తమ పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 504 విలేజ్ ఆర్గనైజేషన్ (విఓ)లు ఉండగా ప్రతీ సంఘానికి ఒక వీఓఏ ఉన్నాడు. ముఖ్యంగా వీఓఏలు మహిళ సంఘాలను సమీకరించి వారి జీవనోపాధిని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల అమలులో మహిళా సంఘాలను క్రియాశీలకం చేయడం, బ్యాంకు లింకేజీలు, స్త్రీనిధి రుణాలు ఇప్పించడం లాంటి బాధ్యతలను వీఓఏలు నిర్వర్తిస్తున్నారు. అయితే గత ఏడు సంవత్సరాల నుంచి స్త్రీనిధి రుణాలకు సంబంధించిన వడ్డీ డబ్బులు మహిళా సంఘాలకు అందడం లేదు. మొత్తం జిల్లాలో వడ్డీ డబ్బులకు సంబంధించి రూ.67.95 కోట్లను వీఓలకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. అలాగే గత నాలుగేళ్ల నుంచి వీఓఏలకు అలాగే వీఓల కు దాదాపు రూ.3.77 కోట్ల ఇన్సెంటివ్ డబ్బులు అందించాల్సి ఉంది. ఇప్పటి వరకు ఈ డబ్బులను ప్రభుత్వం అటు వీఓలకు, ఇటు వీఓఏలకు చెల్లించకపోవడంతో వీరంతా ఆందోళన బాట పట్టేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగానే బుధవారం వీఓ సభ్యులు, వీఓఏలు నిర్మల్ కలెక్టరేట్‌ను ముట్టడించి నిరసన తెలిపారు. ప్రభుత్వం స్త్రీనిధి రుణాల రికవరీపై ఒత్తిడిలు తీసుకువచ్చి తమపై పనిభారం మోపినప్పటికీ తాము రాత్రింబవళ్లు శ్రమించి పూర్తిస్థాయిలో రుణ రికవరీని చేపట్టామంటూ వారు పేర్కొంటున్నారు. ఇలా వరుసగా నాలుగేళ్ళ నుంచి స్త్రీనిధి రుణాలకు సంబంధించి వందశాతం రికవరీని చేపట్టామని అయినప్పటికీ తమకు ఆశించిన రీతిలో గుర్తింపు లభించడం లేదని వారు వాపోతున్నారు. అలాగే వడ్డీ డబ్బులు గానీ ఇన్సెంటివ్ డబ్బుల విషయంలో కూడా ప్రభుత్వం నిర్లక్ష్యధోరణి అవలంబిస్తోందంటూ వారంతా వాపోతున్నారు.



మంత్రి సీతక్క చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జిల్లా మహిళా సంఘాలు (ఫైల్)

ఏళ్ల నుంచి పెండింగ్‌లోనే..

కాగా జిల్లాలో గత ఏడు సంవత్సరాల నుంచి వీఓలకు స్త్రీనిధి రుణాలకు సంబంధించిన వడ్డీ డబ్బులు విడుదల కావడం లేదు. దీంతో పాటు వీఓఏలకు ఇన్సెంటివ్ డబ్బులు కూడా విడుదలకాకపోతుండడంతో వీరంతా ఇక సర్కారుతో తాడోపేడోకు సిద్ధమవుతున్నారు. గ్రామస్థాయిలో మహిళ పొదుపు సంఘాలను చైతన్యవంతం చేస్తూ రుణాల చెల్లింపులపై వారికి అవగాహన కల్పిస్తున్నామని అలాగే రుణాల చెల్లింపులో తాము మహిళ సంఘాల సభ్యులకు పూర్తిస్థాయిలో వివరించి వారి ద్వారా రికవరీ చేయిస్తున్నప్పటికీ తమకు గుర్తింపు లభించకపోతుండడం శోచనీయమంటున్నారు. గత మూడు సంవత్సరాల నుంచి వీఓఏలకు, వీఓలకు ఇన్సెంటివ్ డబ్బులు రావడం లేదని చెబుతున్నారు. తాము గతంలో అప్పటి ప్రభుత్వానికి పలుసార్లు వడ్డీ డబ్బులు , ఇన్సెంటివ్ డబ్బులను చెల్లించాలని వినతిపత్రాలు సైతం సమర్పించామని అయితే అప్పటి ప్రభుత్వం తమ గోడును వినిపించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ డబ్బులు, ఇన్సెంటివ్ డబ్బుల విడుదల విషయమై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రాష్ట్ర మంతటా ఇదే పరిస్థితి..

రాష్ట్రమంతటా వీఓలకు, వీఓఏలకు స్త్రీనిధి రుణాల రికవరీలకు సంబందించి వడ్డీ డబ్బులు గానీ, ఇన్సెంటివ్‌లు గానీ చెల్లించడం లేదంటున్నారు. రాష్ట్రస్థాయిలో మొత్తం 3623 మహిళా సంఘాలు ఉండగా ఈ సంఘాల నుంచి 11,056 సభ్యులకు రుణాలు అందించారు. ముఖ్యంగా జిల్లాలో రూ.వంద కోట్ల రుణాల రికవరీ లక్ష్యం కాగా దాదాపు రూ.103 కోట్ల రుణాలను ఐకేపీ వీఓ, వీఓఏలు రికవరీ చేసి టార్గెట్‌ను చేధించారు. రాష్ట్రంలో మొత్తం 224 కోట్ల రూపాయల వరకు వడ్డీ డబ్బులను వీఓ, వీఓఏలకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. స్త్రీనిధి రుణాలు తీసుకున్న మహిళలు స్వయం ఉపాధి పనులను చేసుకొని ఆ రుణాలను తిరిగి చెల్లించాల్సి ఉంది. దీని కోసం గానూ ఐకేపీ వీఓఏలు, వీఓలు మహిళ సంఘాల్లోని సభ్యులకు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడమే కాకుండా స్వయం ఉపాధి పథకాల నిర్వహణకు సైతం తోడ్పాటునందించారు.

ఘనంగా హరిహరుల కల్యాణ మహోత్సవం

- హాజరైన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- ముగిసిన పెంబి ఆలయ వార్షికోత్సవం



హరిహర కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెంబి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని హరిహర ఆలయ 17వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి. బ్రహ్మోత్సవాల భాగంగా గురువారం హరిహరుల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో పెళ్లి పందిరి వేసి, ఆలయాన్ని విద్యుత్ కాంతులతో సుందరంగా ముస్తాబు చేసి హరిహరుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. యజ్ఞచార్యులు శ్రీ చక్రపాణి నరసింహమూర్తి, వాసు దేవచార్యులు, ఆలయ పండితుల ఆధ్వర్యంలో గురువారం ఆలయ బలిహరణం, పూర్ణాహుతి, హరిహరుల కల్యాణ మహోత్సవం, జాతర, అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితీష్ రాథోడ్ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. మండలంతో పాటు ఇతర మండలాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. దుకాణ సముదాయాలతో కళకళలాడింది. వచ్చిన భక్తుల కొరకు ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో జ్ఞాపికతో సన్మానం చేశారు. వచ్చిన భక్తుల కొరకు మ్యాక్స్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు సల్ల రామేశ్వర్ రెడ్డి, గన్నారపు సురేష్, ఆమెడ వంకర్, పర్వతాల లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సల్ల స్వప్నిల్ రెడ్డి, ఐదు వెంకటేష్, సల్ల నరేందర్‌రెడ్డి, తులాల శంకర్, వీడీసీ అధ్యక్షులు పుప్పాల నర్సయ్య, రాజలింగు, పుప్పాల శంకర్, సదానందం, భూమేష్, వెంకటేష్, రవి, చారి, తదితరులు ఉన్నారు.



ఆలయంలో ఆశీర్వచనం అందుకుంటున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఇంటి పన్ను వసూళ్లలో జిల్లాలోనే లక్ష్మణచాంద మండలం అగ్రస్థానం



లక్ష్మణచాంద, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పన్ను వసూళ్లలో జిల్లాలోనే లక్ష్మణచాంద మండలం అగ్రస్థానంలో నిలిచిందని ఎంపీడీవో రాధా రాథోడ్ గురువారం తెలిపారు. 99 శాతం ఇంటిపన్ను వసూలు చేసినందుకు ఎంపీవో అమీర్‌ఖాన్, ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులను అభినందిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన లక్ష్మణచాంద మండల ప్రజలకు, వాణిజ్య సముదాయాలకు ధన్యవాదాలు తెలిపారు.

అత్యుత్తమ విద్యను అందించేందుకు కట్టుబడి ఉన్నాం

- ఆర్జీయూకేటీలో న్యాక్ సన్నాహక సమావేశంలో వీసీ గోవర్ధన్



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్

బాసర, ఏప్రిల్, 3 : (ఆంధ్రజ్యోతి) : ఆర్జీయూకేటీ విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందించేందుకు కట్టుబడి ఈ ఎన్ఏఏసీ మూల్యాంకన ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటోందని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ అన్నారు. బాసర ఆర్జీయూకేటీలో నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (ఎన్ఏఏసీ) మూల్యాంకనానికి సంబంధించిన సన్నాహక సమావేశం గురువారం వైస్ చాన్సలర్ అధ్యక్షతన జరిగింది. న్యాక్ అక్రిడిటేసన్ ప్రక్రియను నిర్ధారించడానికి అధ్యాపకులను వివరాలతో సంసిద్ధులు కావాలని సూచించారు. ఎన్ఏఏసీ అక్రిడిటేషన్ విద్యాసంస్థలకు నాణ్యత ప్రమాణాలను పెంపొందించేందుకు విద్యా వ్యవస్థలో ఉత్తమ మార్గదర్శకాలను స్థాపించేందుకు ఒక ముఖ్యమైన అంశంగా మారిందన్నారు. ఆర్జీయూకేటీలో నాణ్యమైన విద్యను అందించడంలో అంకితభావంతో ఉంది. పరిశోధన, కొత్త ఆవిష్కరణలకు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులకు ఒక మెరుగైన భవిష్యత్తును అందించడానికి కృషి చేస్తోందని వెల్లడించారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి పలు నూతన కోర్సులను ఏర్పాటు చేయడానికి ఆలోచన చేస్తున్నట్లు వివరించారు. విశ్వవిద్యాలయాన్ని అన్ని రంగాల్లో ముందుంచేందుకు కృషి చేస్తున్నామని అందులో అధ్యాపకుల పాత్ర ఎనలేనిదని అంశాన్ని ప్రస్తావించారు. ఈ సమావేశానికి ఓఎస్‌డీ, ఏవో అసోసియేట్ డీన్‌లు అధ్యాపక వర్గ సభ్యులు హాజరై ఎన్ఏఏసీ సమీక్ష కోసం అవసరమైన ఏర్పాట్లు ప్రణాళికలను చర్చించి ఖరారు చేశారు. యూనివర్సిటీ అకాడమిక్ పరిపాలనా, మౌలిక సదుపాయాల ప్రమాణాలను మెరుగుపరి చేందుకు అధ్యాపకులకు అవసరమైన సూచనలు అందించారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ప్రొఫెసర్ మురళీదర్శన్, ఏవో రణధీర్ అసోసియేట్ డాక్టర్ విట్టల్, డాక్టర్ మహేష్, డాక్టర్ చంద్రశేఖర్, హెచ్‌ఓడీలు అధ్యాపకులు పాల్గొన్నారు.



పాల్గొన్న అధ్యాపకులు, అధికారులు

సర్వాయి పాపన్నగౌడ్‌కు ఘన నివాళి




కుభీర్‌లో పాపన్నగౌడ్ వర్థంతిని నిర్వహిస్తున్న గౌడ సంఘం నాయకులు

కుభీర్, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) 3 : మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో గురువారం మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 315వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్నగౌడ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల గౌడ సంఘం అధ్యక్షుడు చేపూరి కనకాగౌడ్ మాట్లాడారు. బహుజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహనీయుడు సర్దార్ సార్వయి పాపన్నను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు కొండ కిష్టగౌడ్, సత్యగౌడ్, దేవేందధర్, కిష్టాగౌడ్, రమేష్, నరేష్, బాలాగౌడ్, చంద్రాగౌడ్, తదితరులున్నారు.

బాసర - మహోర్ జాతీయ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కారికి ముథోల్ ఎమ్మెల్యే రామరావ్ పాటిల్ విజ్ఞప్తి

భైంసా, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) ; నియోజకవర్గ పరిధిలోని బాసర నుంచి మహారాష్ట్రలోని మహోర్ పుణ్యక్షేత్రం వరకు జాతీయ రహదారిని నిర్మించేందుకుగాను నిధులు మంజూరు చేయాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరికి విజ్ఞప్తి చేశారు. గురువారం న్యూఢిల్లీలో తెలంగాణ బీజేపీ శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి వెళ్లి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరితో భేటి అయ్యారు. ఈ సందర్భంగా బాసర నుంచి మహోర్ వరకు జాతీయ రహదారి నిర్మాణంతో పాటు నియోజకవర్గ పరిధిలోని వివిధ సమస్యలను ఎమ్మెల్యే రామారావ్ పటేల్ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరికి వివరించి వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గానికి సీఐఆర్ఎఫ్ నిధులు కేటాయించాలని, ఇదే క్రమంలో చదువుల తల్లి కొలువైన బాసరలోని గోదావరి నది వంతెన వద్ద ఆత్మహత్యల నివారణ కోసంగాను రక్షణ కంచెను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి సానుకూలంగా స్పందించినట్లుగా ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ తెలిపారు.



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం అందచేస్తున్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్

పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని కలిసిన ఏలేటి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : కేంద్రమంత్రి పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని గురువారం బీజేఎల్పీ నేతే ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆదిలాబాద్‌లో విమానాశ్రయం ఏర్పాటు కోసం రామ్మోహన్ నాయుడుకు వినతిపత్రం అంద జేశారు. ఎంపీ జి.నగేష్, ఎమ్మెల్యేలు పాయల్‌శంకర్, రామారావు పటేల్, పాల్వాయి హరీష్‌బాబు మంత్రులను కలిసిన వారిలో ఉన్నారు.

బాలశక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : బాలశక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బాలశక్తి కార్యక్రమం నిర్వహణపై సంబంధిత అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నిర్వహించిన పలు రకాల వైద్య పరీక్షలు, గుర్తించిన అనారోగ్య సమస్యలు, అందిస్తున్న ప్రత్యేక పోషక ఆహార వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించి హెల్త్ కార్డులను రూపొందించి, ఎప్పటికప్పుడు వాటిలో విద్యార్థుల ఆరోగ్య వివరాలను నమోదు చేయాలన్నారు. పౌష్టికాహార లోపం గుర్తించిన విద్యార్థులకు ప్రత్యేక పౌష్టికాహారాన్ని అందించాలని, విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులపై తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. వేసవి సెలవుల్లో పౌష్టికాహారం లోపం ఉన్న విద్యార్థులకు పౌష్టికాహారం, మందులు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులందరికీ అవగాహన కలిగేలా క్షేత్రస్థాయిలో విద్యార్థులను అవగాహన కల్పించాలన్నారు. ఉన్నత స్థాయిలో ఉన్న పూర్వ విద్యార్థులచే విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని చారిత్రాత్మక ప్రదేశాలకు విహార యాత్రలకు తీసుకువెళ్లాలని, ప్రతి పాఠశాలలో సూచనలు, ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేసి, సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఈవో పి. రామారావు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. రాజేందర్, ఎల్‌డీఎం రామ్‌గోపాల్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు కృషి చేయండి

- ఘన నివాళులర్పించిన అదనపు కలెక్టర్

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతిని గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించారు. అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్ కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆయన పోరాట పటిమను గుర్తు చేశారు. గొప్ప త్యాగధనులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. బలహీన వర్గాల హక్కులను కాపాడడానికి ప్రాణత్యాగం చేసిన గొప్ప వ్యక్తి కొమురయ్య అని కొనియాడారు. మహనీయుల జయంతి, వర్ధంతి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంతో భావి తరాలు ఆయన పోరాట గాథలు తెలుసుకుంటారన్నారు. కొమురయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, మైనారిటీ శాఖ అధికారి మోహన్ సింగ్, సీపీవో జీవరత్నం, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న అధికారులు

అర్హులకు రుణాలు ఇవ్వండి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన వారికి రుణాలు అందజేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ఎస్సీ కార్పొరేషన్ ఈడీని కోరారు. గురువారం ఈడీని కలిసి వినతి పత్రం అందజేశారు. రాజకీయాలకు తావివ్వకుండా రుణాలు ఇవ్వాలని, మహనీయుల జయంతి, వర్ధంతి సంఘాలకు తెలియజేసి నిర్వహించాలని కోరారు. నాయకులు లింగన్న తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ కుటుంబానికి చెక్కు అందజేత

ముథోల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముద్గల్ గ్రామ అంగన్‌వాడీ టీచర్ సునీత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. అయితే గురువారం సీడీపీవో సరోజిని ఫునెరల్ చార్జెస్ కింద రూ. 20 వేల రూపాయల చెక్కును మృతురాలి భర్తకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్, రోజా, తదితరులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు మోటార్ సైకిల్ నుంచి పడి మహిళ మృతి



లక్ష్మిమృత దేహం

సారంగాపూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధని గ్రామానికి చెందిన పంబాల లక్ష్మీ(46) అనే మహిళ ప్రమాదవశాత్తు మోటార్ సైకిల్‌పై నుండి పడి గురువారం మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిర్మల్ నుంచి ధని గ్రామానికి బుధవారం సాయంత్రం బైక్ మీద భర్తతో లక్ష్మి వస్తుండగా ప్రమాదవశాత్తు జారి పడడంతో తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కోసం నిర్మల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేపు భైంసాలో అష్టావదాన కార్యక్రమం

భైంసా, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలోని వేదం తపోవన్ హైస్కూల్‌లో శనివారం అష్టావధాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లుగా ఆనందిత ఫౌండేషన్ చైర్మెన్ వాడేకర్ లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి నిర్వహించే అష్టావధానంలో కవి సమ్మేళనంతో పాటు ఉగాది పురస్కారాలు -2025 కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లుగా వివరించారు. ప్రముఖ శతావధాని డా.ఎం.వి. పట్వర్ధన్ అష్టావదానిగా ఇందులో పాల్గొంటున్నట్లుగా తెలిపారు. ఇందులో పృచ్ఛకులుగా కోవెల శ్రీనివాసాచార్యులు, దాసరి సాయన్న, జాదవ్ పుండలీక్‌రావ్ పాటిల్, పీసర శ్రీనివాస్ గౌడ్, బసవరాజు, కొండూర్ పోతన్న, గంగుల చిన్నన్న, సల్లారాం కిషన్‌లు హాజరవుతుండగా సంచాలకునిగా కడారి దశరథ్ వ్యవహరించునున్నట్లుగా పేర్కొన్నారు. జిల్లాలోని తెలుగు భాషాభిమానులు, కవులు, పండితులు అష్టావధాన కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆనందిత ఫౌండేషన్ చైర్మెన్ వాడేకర్ లక్ష్మణ్ విజ్ఞప్తి చేశారు.

ఏబీవీపీ శ్రేణుల ముందస్తు అరెస్టులు



భైంసా, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ భూముల వ్యవహారంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఏబీవీపీ చేపట్టిన చలో హైదరాబాద్‌కు డివిజన్ పరిధి నుంచి పరిషత్ శ్రేణులెవరు తరలకుండా పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే భైంసా పట్టణ పరిధిలోని ఏబీవీపీ ప్రతినిధులను గురువారం పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. భైంసా పట్టణ పోలీసులు డివిజన్ ప్రతినిధి చంద్రకాంత్‌ను, రూరల్ పోలీసులు మరో ప్రతినిధి గంగాప్రసాద్‌ను అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్లకు తరలించారు. అనంతరం స్వంత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా భైంసా డివిజన్ ఏబీవీపీ ప్రతినిధి చంద్రకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వం పోలీసులతో నిర్బంధకాండ కొనసాగిస్తూ హెచ్‌సీయూ భూములను తమ అనుయాయులకు అప్పనంగా అప్పచెప్పేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ హెచ్‌సీయూ భూములను కాపాడుకొని తీరుతామని వెల్లడించారు. అప్రజాస్వామిక పద్ధతిలో అక్రమ అరెస్టుల ద్వారా ఆందోళనకారుల గొంతునొక్కడం అవివేకమని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



సీఎం, మంత్రి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌అర్బన్, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): ఎయిర్‌పోర్టుకు గ్రీన్ సిగ్నల్ రావడం హర్షణీయమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మసంతోష్ అన్నారు. గురువారం కంది్రశీని వాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క, కంది్రశీనివాస్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించి మరి సాధించారని తెలిపారు. అదే విధంగా అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది్రశీనివాస్‌రెడ్డి మంత్రి సీతక్క చొరవతో ఎయిర్‌పోర్టు విషయంలో లేఖల ద్వారా ఇరు ప్రభుత్వాలకు వినతులు కూడా సమర్పించినట్లు వివరించారు. ఇందులో డీసీసీబీ డైరెక్టర్ బాలూరిగోవర్ధన్‌రెడ్డి, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు మునిగెల నర్సింగ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మసంతోష్‌రావు, నాయకులు బండారి సతీష్, జాఫర్‌అహ్మద్, నాయకులు బూర్లశంకరయ్య, దాసరి ఆశన్న, తిరుమని మహేందర్, సుధాకర్‌గౌడ్, డొగ్గలి రాజేశ్వర్, అడ్డిరూ కేష్‌రెడ్డి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నేతలతో కేసీఆర్ సమావేశం



కేసీఆర్‌తో జరిగిన సమావేశంలో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 27వ తేదీన వరంగల్‌లో 10 లక్షల మందితో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ కార్యక్రమాల నిర్వహణపై గురువారం ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లా ముఖ్యనేతల సమావేశానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వరంగల్‌లో ఈనెల 27న జరిగే బహిరంగసభ గురించి కేసీఆర్ దిశానిర్ధేశం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకృష్ణ పాడిన పాటను కేసీఆర్ ఆవిష్కరించారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లా నేతలు పాల్గొన్నారు.

పీవీటీజీ ప్రవేశాల కోసం దరఖాస్తులకు ఆహ్వానం

ఉట్నూర్, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఆసి ఫాబాద్‌లో ఉన్న తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకులాల పీవీటీజీ పాఠశాల, కళాశాలలో ప్రవేశం కోసం అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని గురుకులాల ఆర్‌సీవో అగస్టియన్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి మూడోతరగతిలో ప్రవేశం కోసం, నాలుగు నుంచి 9 తరగతుల వరకు ఖాళీ ఉన్న మిగిలిన సీట్లకు ఆదిమ గిరిజనులైన కోలాం, తోటి విద్యార్థులు మూడోతరగతిలో 80 సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అదే మాదిరి 4వ తరగతిలో 62, ఐదవ తరగతిలో 38, ఆరవ తరగతిలో 21, 8వ తరగతిలో 17 మొత్తం 21,218 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 9 నుంచి 30 వరకు ఆసిఫాబాద్‌లోని పీవీటీజీ గురుకుల పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

పట్టా మార్పిడిపై వివరాలు తెలుపాలని వినతి

బోథ్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టామార్పిడిపై వివరాలు తెలుపాలని గ్రామస్తులు కోరారు. మండలంలోని కౌట (బీ) గ్రామం పరిసరాలలో గత 20 సంవత్సరాల క్రితం నిర్మించిన నీటికుంట భూమి సర్వేనంబర్ 149 బైఆ సర్వే నంబర్లు నాలుగు ఎకరాల 26 గుంటల భూమి గ్రామానికి చెందిన ఒకరిపై మార్పిడి జరిగిందన్నారు. ఈ విషయమై తమ పూర్తివివరాలు ఇవ్వాలని గ్రామానికి చెందిన మాజీ సహకార సంఘం చైర్మన్ బాబురెడ్డితో పాటు గ్రామనాయకులు కళ్లెం మురళీధర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గడ్డల రమణ మాజీ వార్డుసభ్యులు ఐ.రమణారెడ్డి కొంకటి గంగాధర్, మల్లెపూల రమేష్ తదితరులు తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. అంతేగాక తాము గతంలో కొనుగోలు చేసిన భూమికి సంబంధించిన సరిహద్దులు సైతం చూపించాలని తహసీల్దార్ సుభాష్‌చంద్రను కోరారు. స్పందించిన తహ సీల్దార్ మొదట భూమి ఏ విధంగా మార్పిడి జరిగిందనే విషయం పరిశీలించి వివరిస్తామని, తాము ఈ విషయంలో పూర్తి వివరాలను పరిశీ లిస్తున్నామన్నారు. సంబంధించిన రిపోర్టు సిద్ధం చేసి జిల్లా కలెక్టర్‌కు విన్నవిస్తామన్నారు.

● అనుమతి లేకుండా మొరం తవ్వితే క్రిమినల్ కేసులే...

నీటికోసం నిర్మించిన నీటి కుంట నుంచి అనుమతి లేకుండా మొరం గాని, నల్ల మట్టిని గాని తవ్వినట్లయితే క్రిమినల్ కేసులు పెడతామని తహసీల్దార్ పేర్కొన్నారు. రైతులు తమ చేలలోకి మట్టిని తీసుకుపోవాలంటే తమకు మొదట దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆ తర్వాత తాము అనుమతులు ఇస్తామన్నారు. ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలన్నారు.



వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ప్రహరీ నిర్మించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నేరడిగొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నేరడిగొండ కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌ను గురువారం నేరడిగొండలోని తన క్యాంప్ కార్యాలయంలో ఇచ్చోడ కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు గోపుల శివకుమార్ ఆధ్వర్యంలో కోకస్ మన్నూర్ గ్రామానికి చెందిన మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం కమిటీ కలిసింది. సంఘం భవనం చుట్టూ ప్రహరీ నిర్మాణంతో పాటు హైమాస్‌లైట్ ఏర్పాటు చేయాలని కోరు తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ ప్రహరీ నిర్మాణానికి తనవంతు కృషి తప్పకుండా చేస్తానని, త్వర లోనే ఎస్.డీ.ఎఫ్. నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుందని, ఈ నిధులతో ప్రహరీ నిర్మాణానికి తానే ముందుండి భూమి పూజచేసి పనులను ప్రారంభిస్తానని హామీ ఇచ్చారు. అదేరోజు హైమాస్ లైట్‌ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. అనంతరం కమిటీ సభ్యులను కూడా శాలువాలతో ఆడే గజేందర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మున్నూరు కాపుసంఘం అధ్యక్షులు కాండ్లి విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రవీందర్, కోశా ధికారి నరాల రాజేశ్వర్, సలహాసభ్యులు గోపుల సత్యనారాయణ, కాండ్లి గణేశ్, కాగితపు నారాయణ, బలుగురి చిన్న గంగయ్య, నరాల శిరీష్, కాగితపు నారాయణ పాల్గొన్నారు.

'యువత కష్టపడి ఎదగాలి'

తలమడుగు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తలమడుగు మారుమూల గ్రామానికి చెందిన యువకునికి దేశసేవ చేసే భాగ్యం లభించడం ఎంతో అభినందనీయమని, యువత కష్టపడి ఎదగాలని గ్రామస్తులు అన్నారు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని పల్లీ(బీ) గ్రామానికి చెందిన దురిశెట్టి ప్రవీణ్, గీత దంపతుల కుమారుడు చంద్ర సిద్ధార్థకు ఇండియన్ ఆర్మీ ఉద్యోగం రావడం పట్ల గ్రామస్తులు ఆయనను అభినందించారు. వారికి గ్రామస్తులు సన్మానించారు. ఇదే స్ఫూర్తితో యువకులు కష్టపడి ఉద్యోగ ఉపాధి అవకాశాలను సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. ఇందులో గ్రామపెద్దలు నల్ల శభాష్ రెడ్డి, కటకం శ్రీనివాస్, కె.విఠల్, ఎం.గంగన్న, మల్కు, అశోక్, రమేష్, సోమన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

'పట్టణ ప్రజలకు ఉచితంగా మంచినీరు అందిస్తా'

బోథ్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రోజురోజుకు మంచి నీటిఎద్దడి తీవ్రమవుతుండడంతో పట్టణానికి చెందిన కళ్లెం పోశెట్టి అనేవ్యక్తి మంచినీరు అందించేందుకు ముందుకువచ్చాడు. అధికారులు నీటిఎద్దడి నివారణపై నీటి వసతి ఉన్న బోరు బావులను అద్దెకు తీసుకుంటున్న సమయంలో పోశెట్టి మాత్రం తాను ఉచితంగా ఇస్తానంటూ ముందుకు వచ్చారు. అంతేగాక తన ఇంటి వద్ద బోర్డును ఏర్పాటు చేసి తాగునీటి వసతికల్పనకు తన వంతు చేయూతనిస్తానని పేర్కొంటున్నారు. ఉచితంగా తాగునీరు అందిస్తానని ముందుకు వచ్చిన ఈయనను పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు.

సన్న బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మావల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న సన్నం బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి రాజలింగు పేర్కొన్నారు. గురువారం మండలంలోని వాఘపూర్ గ్రామంలో సన్న బియ్యం పంపిణీని తహసీల్దార్ వేణుగోపాల్‌తో కలిసి పరిశీలించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులను మం జూరు చేస్తామన్నారు. అదేవిధంగా రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హు లు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇందులో జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

కప్పర్లలో సన్న బియ్యం కేంద్రం ప్రారంభం

తాంసి : మండలంలోని కప్పర్ల గ్రామంలో సన్న బియ్యం పంపిణీ కేంద్రా న్ని గురువారం ప్రారంభించారు. గ్రామంలోని సుమారు 1500 తెల్లరేషన్ కార్డులకు వీటిని అందించ నున్నారు. ప్రతి ఒక్కరికి సకాలంలో సన్న బియ్యా న్ని అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత డీలర్లకుకోరారు. కార్యక్ర మంలో మాజీ సర్పంచ్ సదానందం, ఎంపీటీసీ కొడాల సంతోష్, మహేంద ర్, బుజ్జన్న, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్ : మండల ప్రత్యేక అధికారి సుధాకర్‌తో కలిసి సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించామని ఆర్టీఏ సభ్యులు దూట రాజేశ్వర్ తెలిపారు. ఉట్నూర్ మండలంలోని లక్కారం, ఉట్నూర్, సాంపూర్, ఉమ్రి, దంతన్‌పల్లిలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాలను పరిశీలించామన్నారు. వారి వెంట డీసీసీబీ డైరెక్టర్ ఎస్పీరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బానోత్ జైవంతరావు, అరికెల్ల పరమేశ్, కోడి ప్రభాకర్, దర్శని గంగారాజులు పాల్గొన్నారు.



ఉమ్రిలో పాల్గొన్న స్పెషల్ ఆఫీసర్, ఆర్టీఏ సభ్యులు

'సీసీఐని కేంద్రం వెంటనే పునఃప్రారంభించాలి'

ఆదిలాబాద్‌అర్బన్, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారంతో 16వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ బీసీ విభాగం పట్టణ అధ్యక్షులు దాసరి రమేష్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీసీఐ ఫ్యాక్టరీని కేంద్రప్రభుత్వం పునఃప్రారంభించాలన్నారు. పార్లమెంట్ సమావేశాల్లోనే ఫ్యాక్టరీ పునరుద్ధరణకు నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇందులో సీపీఎం సీనియర్ నాయకులు లంకరాఘవులు, కస్తూరి, పరమేశ్వర్, హన్మాండ్లు, ఈరన్న, గట్లనర్సింహులు, ఎన్.స్వామి, కె.ఆశన్న, ఎం. స్వామి, గంగారం, ఎం. గంగారాం, దాసరి రవీందర్, మామిళ్ల గంగయ్య, అలాల్ అజయ్, బుట్టి శివకుమార్ తదితరులున్నారు.

మేడిగూడలో ముగిసిన వేడుకలు

జైనథ్, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): జైనథ్ ఉమ్మడి మండలంలోని మేడిగూడ సీ గ్రామంలోని దత్తమందిరంలో రెండురోజులుగా నిర్వహిస్తున్న పలు వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో ముగిశాయి. ఈ సందర్భంగా 48 గంటల పాటు నిర్వీరామంగా భజనసంకీర్తనలు భక్తి పాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా దత్తమహారాజ్ ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మహిళలు నృత్యాలు చేసి భక్తి పాటలను ఆలపించారు. భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తుడంగంగన్న, తుడంరమేష్, గ్రామ పెద్దలు జి.రామన్న, రవి, తుడంరాములు, పొచ్చన్నలతో పాటు ఆయా గ్రామాల భక్తులు, మహిళలు మేడిగూడ సీ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

'మంచి మార్గంలో నడవాలి'

భీంపూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అందరూ మంచి మార్గంలోనే నడవాలని ప్రముఖ అధ్యాత్మికవేత్త శ్రీమాన్ ప్రవనసంద అన్నారు. ఆయన మండలంలోని కరంజి (టీ) రామాలయంలో శ్రీ రామనవమి కార్యక్రమంలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి క్రమశిక్షణగా నిజాయితీగా ఉన్నపుడు సమాజం సుభిక్షంగా ఉంటుందన్నారు. రామాయణ, మహాభారత భాగవత గీత లాంటి గ్రంథాలు చదివి మంచి ఆచరించాలన్నారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ గుర్ల నరేందర్ యాదవ్, బక్కి సతీష్ యాదవ్, నరేందర్ రెడ్డి, దేవారెడ్డి, అశోక్ రెడ్డి, రెడ్డి రమేష్ పాల్గొన్నారు.

'దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి ఆదర్శం'

సోనాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి దొడ్డికొమురయ్య అని కురుమ సంఘం అధ్యక్షుడు పోతన్న అన్నారు. గురువారం బస్టాండ్ సమీపంలో కొమురయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటానికి తొలి అమరత్వాన్ని ఇచ్చి స్ఫూర్తి నింపిన మహోన్నత నాయకుడు కొమురయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో చంద్రకాంత్, శంకర్, దేవేందర్, దేవన్న, నారాయణ, సంతోష్, విజయ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి డప్పు వాయిద్యాలతో వీడ్కోలు

భీంపూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు బాధ్యతగా బోధన చేస్తూ అభిమానం సంపాదించుకున్న ఆ ఉపాధ్యాయునికి విరమణ సందర్భంగా ఘనంగా వీడ్కోలు పలికారు. ఆ గ్రామస్తులు .. భీంపూర్ మండలం పిప్పల్‌కోటి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రమేష్ గురువారం ఉద్యోగవిరమణ పొందాడు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయన సేవలు గుర్తు చేసుకుంటూ కన్నీరుమున్నీరు అవుతూ వీడ్కోలు పలికారు. పాఠశాల నుంచి డప్పువాయిద్యాలతో గ్రామశివారు వరకు గ్రామస్తులందరూ ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎంఈవో శ్యామ్‌సుందర్, ఎస్ఎంఎస్ చైర్మన్ మల్లికార్జున్, ఉపాధ్యక్షులు మహేష్, సూరజ్, శంకర్, వికేష్, తిరుపతి, అశోక్‌రెడ్డి, గ్రామ పెద్దలు రమాకాంత్, నర్సింగ్, వెంకటి తదితరులు ఉన్నారు.

ఛత్రపతి శివాజీ మహారాజ్‌కు ఘన నివాళి



లక్ష్మణచాంద, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతి సందర్భంగా గురువారం ఛత్రపతి మహారాజ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహారాష్ట్రలో శూద్రరాజ్య నిర్మాతగా ఆయన చేసిన ఘన కార్యాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, అట్ల రాంరెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ సిరాజుద్దీన్, కల్లెడ భూమన్న, మాజీ సర్పంచ్‌లు నారాయణ, ప్రతాప్ రెడ్డి, రంజిత్, వినేష్, నాగేష్, సమ్మెట రవి, తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన ఫలితాలు సాధించాలి : డీఈవో

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెట్టి అభ్యసన ఫలితాలు సాధించాలని డీఈవో రామారావు సూచించారు. గురువారం పంచశీల బీఈడీ కళాశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని డీఈవో ప్రారంభించారు. నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని, పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పీజీ, పీఎస్ హెడ్‌మాస్టర్లు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ అరెస్టు

తానూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా ఎస్ఎఫ్ఐ కన్వీనర్‌ను గురువారం పోలీసులు అరెస్టు చేసి తానూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. హెచ్‌సీయూ భూముల ఘటన నేపథ్యంలో ఛలో సెక్రటేరియట్ ముట్టడి సందర్భంగా ముందస్తు అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా దిగంబర్ మాట్లాడుతూ హెచ్‌సీయూ భూములను వేలంపాట వేయడాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలన్నారు. విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి, అక్రమంగా విద్యార్థులపై లాఠీ ఛార్జీ చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తెల్లకార్డు ఉన్న ప్రతి కుటుంబానికి సన్నబియ్యం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్క కుటుంబానికి ప్రభుత్వం సన్నబియ్యం అందిస్తుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నాందేడపు చిన్ను అన్నారు. గురువారం శాంతినగర్‌లో జిల్లా మైనారిటీ అధ్యక్షుడు జునైద్ మెమన్‌తో కలిసి లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. హర్షద్, సబా కలీమ్, కీజర్, గణేష్, ఖలీల్, తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో తాగునీటి సౌకర్యం కల్పించాలి

లక్ష్మణచాంద, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ కూలీలు పని చేస్తున్న ప్రదేశంలో తాగునీటి సౌకర్యం కల్పించాలని ఎంపీడీవో రాధా రాథోడ్ గురువారం అన్నారు. మండలంలోని మల్లాపూర్ గ్రామంలో ఈజీఎస్ కూలీలచేత వేస్తున్న రోడ్డు ఫార్మేషన్ పనులను ఆమె పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. స్థానిక సిబ్బందికి తగు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుర్జీత్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ గొర్రె ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

దిలావర్‌పూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పరీక్షలు పూర్తికాగానే సిర్గాపూర్‌లోని ప్లేయర్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థులు గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. కరస్పాండెంట్ కేఎల్. నర్సింహారెడ్డితో పదో తరగతి విద్యార్థులు తమ పాఠశాల అనుభవాలను పంచుకున్నారు.

మహిళల భద్రత కోసం భరోసా కేంద్రం

● నిర్మల్ ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : వేధింపులు, అత్యాచారానికి గురైన బాధిత మహిళలకు భరోసా కేంద్రం అండగా ఉంటుందని ఎస్పీ జానకి షర్మిల హామీ ఇచ్చారు. గురువారం పోలీసు అక్క కార్యక్రమంలో భాగంగా జిల్లా కార్యాలయంలో పోక్సో, అత్యాచార బాధితులకు భరోసా నిధుల నుంచి 9 మంది మహిళలకు ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ... రాష్ట్ర మహిళా పోలీసు వెల్ఫేర్ ఆధ్వర్యంలో భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వేధింపులు, అత్యాచారం, బాధిత మహిళలకు, పిల్లలకు ఒకేచోట మెడికల్, న్యాయ సలహా, వైద్యం, కౌన్సిలింగ్, సైకాలజీ తదితర సమస్యలను ఒకేచోట పరిష్కరించేందుకు భరోసా కేంద్రం కృషి చేస్తోందన్నారు. మహిళలు, పిల్లలకు కొండత ధైర్యాన్ని నింపి సమస్యలకు తక్షణ పరిష్కారం చూపుతాయని స్పష్టం చేశారు. చిన్న మనస్పర్థలతో దూరంగా ఉన్న 50 కుటుంబాలకు భరోసా కేంద్రం కౌన్సిలింగ్ నిర్వహించి వారిని కలిపినట్టు చెప్పారు. షీ టీమ్స్, భరోసా సిబ్బంది మహిళల భద్రతకు పోలీసు శాఖ నిరంతరం పని చేస్తోందని వివరించారు. కోర్టు విచారణలో ఉన్న పోక్సో అత్యాచార కేసులను ప్రత్యేక పోలీసు అధికారులతో అపరాధులకు శిక్షలు పడే వరకు సాక్షులను ప్రవేశపెట్టి నేర నిరూపణ చేయడం జరుగుతోందన్నారు. గత ఏడాది జనవరి నుండి ఇప్పటి వరకు 9 కేసుల్లో నేర నిరూపణ అయి దోషులకు శిక్షలు పడ్డాయన్నారు. జిల్లాలో మహిళలపై అఘాయిత్యాలు తగ్గుముఖం పట్టాయని పేర్కొన్నారు. భరోసా ఇన్‌చార్జి ఎస్సై ఫెర్సిస్, సిబ్బంది జ్యోతి, శిరీష, స్వప్న, సుమలత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ జానకి షర్మిల

అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి

● గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలి

● ఖానాపూర్, కడెం, దస్తురాబాద్, పెంబి మండలాల అధికారులతో సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పెంబి (ఖానాపూర్), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం పెంబి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం, ఖానాపూర్ పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దస్తురాబాద్, కడెం, ఖానాపూర్, పెంబి మండలాల తహసీల్దార్, ఎంపీడీవో, పంచాయతీరాజ్ శాఖ, విద్యుత్‌శాఖ, మిషన్ భగీరథ, పంచాయతీ కార్యదర్శులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి, విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ, నూతన రేషన్ కార్డులు, రోడ్ల పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలను గుర్తించి సమస్యల పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు పంపిణీ చేయలని, దళారుల హస్తం పకడ్బందీగా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దడానికి అభివృద్ధి పనులను చేపడుతోందని, పనుల విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, జాప్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఫ్లోరైడ్ ఉన్న గ్రామాల్లో మంచి నీటిని అందించాలని సూచించారు. అన్ని గ్రామాల్లోని నీటిని సేకరించి తమ వద్ద ఇవ్వాలని ఆ నీటిని పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతయుతంగా మెలుగుతూ విద్యుత్‌ను పొదుపుగా వాడాలన్నారు. వేసవి కాలంలో గ్రామాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి సన్న బియ్యం పంపిణీ చేస్తోందని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కడెం, ఖానాపూర్, పెంబి, మండలాల తహసీల్దార్, పంచాయతీ రాజ్ డీఈ, ఏఈ, మిషన్ భగీరథ డీఈ, ఏఈ, విద్యుత్ శాఖ డీఈ, ఏఈ, జేఈ, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మండలంలోని వేణునగర్ గ్రామానికి చెందిన ఆత్రం నాగోరావు ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సల్ల స్వప్నల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు భీమ్ రావు, అశోక్ రావు, రమేష్, శంకర్, తదితరులు ఉన్నారు.

'రాజ్యాంగాన్ని బీజేపీ అవహేళన చేస్తుంది'

సారంగాపూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ పార్టీ రాజ్యాంగాన్ని అవహేళన చేస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి అన్నారు. గురువారం మండలంలో గల తాండ్ర, వైకుంఠాపూర్, కంకెట గ్రామాల్లో జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ విగ్ర హానికి పూలమాలలు వేసి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. దేశ సమగ్రతను కాపాడటంలో బీజేపీ రాజకీయం చేస్తుందన్నారు. పార్లమెంట్ సభలో కేంద్ర మంత్రి అమిత్ షా రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్‌ను అవమాన పరిచారని తక్షణమే క్షమాపణ చెప్పి మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ పాదయాత్ర ద్వారా బీజేపీ చేస్తున్న అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ పాదయాత్ర కార్యక్రమంలో చైర్మన్ అబ్దుల్ హాది, పార్టీ మండల అధ్యక్షులు బి. నర్సయ్య, నాయకులు మల్లారెడ్డి, పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, సత్యపాల్‌రెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



'భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్ర జరుగుతోంది'



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తోందని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని మంజులాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నాందేడపు చిన్ను, ఖానాపూర్ నియోజకవర్గ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమ ఇన్‌చార్జి రామ్‌భూపాల్, మాజీ మున్సిపల్ చైర్మన్లు అప్పాల గణేష్, నిర్మల్ కార్యక్రమ ఇన్‌చార్జి రాజూర సత్యం, సేవాదళ్ రాష్ట్ర నాయకులు ఎంబడి రాజేశ్వర్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌లో కాంగ్రెస్ పార్టీ జై సంవిధాన్ పాదయాత్ర



పాదయాత్రలో మాజీ మంత్రి ఐకే రెడ్డి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా కేంద్రం రాంనగర్‌లో గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి హాజరై అంబేద్కర్ విగ్రహానికి, బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. పట్టణ అధ్యక్షుడు నాందేడపు చిన్ను, మైనారిటీ అధ్యక్షుడు జునైద్ మెమన్, ముడుసు సత్యనారాయణ, ధర్మాజీ రాజేందర్, వాజిద్ అహ్మద్, పాకాల రాంచందర్, మాజీ కౌన్సిలర్ రఘు, అనుముల భాస్కర్, కొప్పుల శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

దిలావర్‌పూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పవిత్రమైన భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన తరుణం ఆసన్నమైందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తక్కల విద్యాసాగర్‌రెడ్డి అన్నారు. జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం న్యూలోలం, సిర్గాపూర్, మాయాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు బీజేపీ కుట్ర చేస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, అణగారిన వర్గాలను అణచివేసి పెత్తం దారులకు వంత పాడేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మనోహర్ రావు, అనిల్, రాజారెడ్డి, ధని రవి, దయాకర్, ఆర్గుల రమణ, సలీం, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : దుష్టశక్తులు భారత రాజ్యాంగాన్ని మారుస్తామంటే ఊరుకునేది లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఒడ్నాల రాజేశ్వర్, ఈటెల శ్రీనివాస్‌లు గురువారం హెచ్చరించారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని మండలంలోని మునిపెల్లి, మాచాపూర్, మల్లాపూర్ గ్రామాల్లో గురువారం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పీఠికను చదివి వినిపించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేశారు.


గుండంపల్లిలో సాగు చేస్తున్న మొక్కజొన్న


ఆశాజనకంగా ఉన్న సీడ్ జొన్న


పూతకు వచ్చిన నువ్వు పంట

ఆరు తడి.. సిరుల దిగుబడి!

● ఆశాజనకంగా పంటలు ● ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



దిలావర్‌పూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆరుతడి పంటలు రైతులు ఇంటా సిరులు కురిపిస్తున్నాయి. తక్కువ పెట్టుబడి.. ఎక్కువ దిగుబడి ఇచ్చే ఆరుతడి పంటల సాగుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. వ్యవసాయాధికారులు సైతం పంట మార్పిడి, ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించడం ఫలితాలనిస్తోంది. దిలావర్‌పూర్ మండలంలో సుమారు 6,500ల ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగుచేస్తున్నారు. ఇందులో అత్యధికంగా 5,100 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తుండగా 650 ఎకరాల్లో జొన్న సాగు చేస్తున్నారు. మిగిలిన భూముల్లో నువ్వు, పెసర, కూరగాయల సాగు చేస్తున్నారు.

ఆదర్శంగా గుండంపల్లి

మండలంలోని గుండంపల్లి రైతులు పంటల సాగులో ఆధునిక పద్ధతులను అనుసరిస్తూ అధిక దిగుబడులు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ గ్రామంలో వరి సాగు కంటే ఆరుతడి పంటలను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తారు. గ్రామ రైతులు ఈ యాసంగిలో సాధారణ మొక్కజొన్నతో పాటు సీడ్ మొక్కజొన్న, కూరగాయలు, నువ్వును పెద్ద మొత్తంలో సాగు చేస్తున్నారు.

సిరులు కురిపించిన సీడ్ మొక్కజొన్న

విత్తనాలు వేసినప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకు రైతుల కష్టం చెప్పాల్సి నవి కాదు. విత్తనాలు, నీరు, విద్యుత్, పెట్టుబడి, కూలీలు ఇలా ఎన్నో కష్టాలు ఎదు ర్కొంటారు. అయితే పలు ప్రై వేట్ కంపెనీలు మేలైన విత్తనాలను ఇస్తూ సీడ్ పంటల సాగు వైపు ప్రోత్సహిస్తున్నాయి. గుండంపల్లి, సముందర్ పల్లి, కాండ్లి రైతులలో ఈ ఏడాది యాసంగి పంటగా ఓ ప్రైవేట్ కంపెనీ ఇచ్చిన సీడ్ మొక్కజొన్న సాగుచేసి మంచి లాభాలు పొందారు. సుమారు 415 ఎకరాల్లో సీడ్ మొక్కజొన్న సాగు చేశారు. ఇందుకోసం కంపెనీతో రైతులు బై బ్యాక్ ఒప్పందం చేసుకున్నారు. విత్తనాలతో పాటు ఎరువులను కంపెనీ ఉచితంగా


కాతకు వచ్చిన పెసర పంట


దిలావర్‌పూర్‌లో కల్లాల్లో మక్కలు ఆరబెట్టిన రైతులు

ఇచ్చింది. పంట వచ్చాక కంపెనీయే కొనుగోలు చేసింది. దీంతో రైతులకు పెట్టుబడి మిగిలినట్లయింది. రైతులు ఆశించినట్లుగానే సీడ్ మొక్కజొన్న మంచి దిగుబడి వచ్చింది. సాధారణ మొక్క జొన్నకు క్వింటాల్‌కు రూ. 2,100 ధర ఉండగా సీడ్ మొక్కజొన్న రూ. 3,600ల ధర చెల్లించారు. ఈ లెక్కన గుండంపల్లి, సముందర్‌పల్లి, కాండ్లి రైతులకు ఎకరానికి దాదాపు రూ. ఒక లక్ష నుంచి లక్షా పదివేల వరకు వచ్చాయి. సీడ్ మొక్కజొన్న సాగు చేసిన ఈ గ్రామాల రైతులకు సుమారు రూ. 42 కోట్ల వరకు వచ్చాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆశాజనకంగా సాధారణ మొక్కజొన్న, సీడ్ జొన్న

5,100 ఎకరాల్లో మొక్కజొన్న సాగులో 415 ఎకరాలు సీడ్ మొక్కజొన్న పోనూ మిగతా 4,685 ఎకరాల్లో సాధారణ మొక్కజొన్న సాగు చేశారు. 525 ఎకరాల్లో సీడ్ జొన్న సగు చేస్తున్నారు. సీడ్ జొన్నతో పాటు సాధారణ మొక్కజొన్న సైతం ఆశాజనకంగా ఉండటంతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

మరిన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

సాధారణ మొక్కజొన్న రైతులకు మద్ధతు ధర కరువైంది. రైతుల నిస్సహాయతను ఆసరా చేసుకున్న దళారులు క్వింటాల్‌కు రూ. 2,100లు చెల్లించి హమాలీ, ఆడ్తీ పేరుతో మినహాయించుకుంటున్నారు. అన్నీ పోనూ రైతులకు క్వింటాల్‌కు రూ.1,900లు వస్తున్నాయి. మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు సిద్ధమవుతున్నారు. క్వింటాల్‌కు రూ.2,225ల మద్దతు ధర చెల్లించేందుకు నిర్ణయించారు. అయి తే కేవలం నిర్మల్, ఖానాపూర్, కుభీర్, సారంగాపూర్, భైంసాలలో మాత్రమే ఐదు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుండటం రైతులను నిరాశకు గురి చేస్తోంది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఇప్పటికే పెద్ద మొత్తంలో ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకున్నారు. మిగిలిన రైతులకైనా అందుబాటులో ఉండే విధంగా ప్రతీ మండల కేంద్రంలో ఒక మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

దిగుబడి బాగా వచ్చింది.. చాలా ఆనందంగా ఉంది!

● నలిమెల గంగారెడ్డి, రైతు, గుండంపల్లి



నేను యాసంగిలో 9 ఎకరాల్లో సీడ్ మొక్కజొన్న సాగు చేశాను. నేను ఊహించని విధంగా దిగుబడి వచ్చింది. మా కష్టానికి ఫలితం దక్కింది. చాలా ఆనందంగా ఉంది. ప్రతీసారి పంట పెట్టుబడి కూడా వెళ్లేది కాదు. ఈసారి మాత్రం ఎకరాకు రూ. లక్షా 15 వేలు వచ్చాయి. నాకు తెలిసి ఇంత మంచి దిగుబడి, డబ్బు ఎప్పుడు రాలేదు. చాలా సంతోషంగా ఉంది.

మార్కెట్ కమిటీల వార్షిక ఆదాయ

లక్ష్య సాధనలో మిశ్రమ ఫలితాలు

● నిర్మల్ జిల్లాలో ఐదు మార్కెట్ కమిటీలు ● లక్ష్యాన్ని మించిన నిర్మల్, భైంసా, కుభీర్ మార్కెట్ కమిటీలు ● వెనుకబడ్డ సారంగపూర్, ఖానాపూర్ మార్కెట్ కమిటీలు
● 2024-25 వార్షిక ఆదాయ లక్ష్యం రూ.13.96 కోట్లు ● చేకూరిన ఆదాయం రూ.13.91 కోట్లు


భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం


భైంసా మార్కెట్ కమిటీ పరిధిలో జరుగుతున్న కొనుగోళ్లు


భైంసా మార్కెట్ కమిటీ గ్రేయిన్ మార్కెట్ యార్డు

భైంసా, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలు వార్షిక ఆదాయ లక్ష్య సాధనలో మిశ్రమ ఫలితాలు సాధించాయి. జిల్లాలో ఐదు వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉండగా ఇందులో నిర్మల్, భైంసా, కుభీర్ మార్కెట్ కమిటీలు లక్ష్యాన్ని మించి ఆదాయాన్ని అర్జించగా ఖానాపూర్ ,సారంగపూర్ మార్కెట్ కమిటీలు ఆదాయ లక్ష్య సాధనలో వెనుకబడ్డాయి. 2023-24 వార్షిక సంవత్సరం జిల్లాలోని భైంసా మార్కెట్ కమిటీ మినహా మిగతా నాలుగు మార్కెట్ కమిటీలు ఆదాయ లక్ష్యాన్ని ఆర్జించాయి. ఇక 2024-25 వార్షిక సంవత్సరములో భైంసాతో సహా మూడు మార్కెట్ కమిటీలు లక్ష్యాన్ని అధిగమించగా ఖానాపూర్, సారంగపూర్ మార్కెట్ కమిటీలు వెనుకబడిపోయాయి. ఇక జిల్లా వారీగా పరిశీలిస్తే 2024-25 అర్థిక సంవత్సరములో జిల్లాలో ఐదు మా ర్కెట్ కమిటీల వార్షిక అధాయ లక్ష్యం రూ.13,96,28,000 కోట్లు నిర్ధేశించడింది. అయితే వార్షిక సంవత్సరం ముగింపు సమయానికి జిల్లాలోని మార్కెట్ కమిటీల ద్వారా రూ13,90,84,000 కోట్ల ఆదాయం చేకూరింది. వార్షిక లక్ష్య ఆదాయంలో రూ.5.44లక్షలు తగ్గింది.

● జిల్లాలో రూ.5.44 లక్షల మేర తగ్గిన ఆదాయం

2023-24 వార్షిక సంవత్సరములో జిల్లాలోని ఐదు మార్కెట్ కమిటీలలో ఒక భైంసా మార్కెట్ కమిటీ మినహా నిర్మల్, ఖానాపూర్, సారంగపూర్, కుభీర్ మార్కెట్ కమిటీలు లక్ష్యాన్ని మించి ఆదాయాన్ని సాధించాయి. జిల్లాలోని ఐదు మార్కెట్ కమిటీలకు వార్షిక ఆదాయ లక్ష్యం రూ.14.62 కోట్లు నిర్దెశించబడగా రూ.1.35 కోట్ల అధనంగా ఆదాయాన్ని సాధించి మొత్తం రూ.15.97 కోట్లు ఆదాయాన్ని సమకూర్చుకున్నాయి.2024-24 వార్షిక సంవత్సరములో రూ.13.96 కోట్లు ఉండగా రూ.5.44 లక్షలు తక్కువగా రూ.13.91 కోట్ల ఆదాయం సమకూరింది.

● మార్కెట్ కమిటీల వారీగా ..

భైంసా మార్కెట్ కమిటీ 2024-25 వార్షిక ఆదాయ లక్ష్యం రూ.6.27 కోట్లు ఉండగా రూ.23 లక్షలు అధనపు ఆదాయాన్ని ఆర్జించి రూ.6.50 కోట్లు సాధించింది. ఇక నిర్మల్ మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.3.56 కోట్లు ఉండగా రూ.30 లక్షల మేర అధనంగా ఆదాయన్ని ఆర్జించి రూ.3.86 కోట్లు, కుభీర్ మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.64 లక్షలు ఉండగా రూ.16 లక్షలు అధనపు ఆదాయాన్ని సమకూర్చుకొని రూ.80 లక్షలు సాధించాయి. ఖానాపూర్ మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.2.18 కోట్లు ఉండగా రూ.1.54 కోట్లు, సారంగపూర్ మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.1.30 కోట్లు ఉండగా రూ.1.20 ఆదాయాన్ని సమకూర్చుకున్నాయి. వార్షిక ఆదాయ లక్ష్య సాధనలో ఖానాపూర్ మార్కెట్ కమిటీ రూ.64 లక్షలు, సారంపూర్ మార్కెట్ కమిటీ రూ.10 లక్షలు తక్కువగా ఆర్జించాయి.

పక్కదారి పడుతున్న సిలిండర్లు

● చోద్యం చూస్తున్న అధికారులు
● జోరుగా సాగుతున్న కల్తీ ఆహార పదార్థాలు


ఉట్నూర్‌లో టీ స్టాల్ వద్ద వినియోగిస్తున్న సిలిండర్


ఉట్నూర్‌లోని హోటళ్లలో వినియోగిస్తున్న గృహావసరాల సిలిండర్లు

ఉట్నూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ ఏజెన్సీలోని గిరిజన ప్రాంతాల్లో గృహ అవసరాల కోసం ఇస్తున్న సిలీండర్లు పక్కదారి పడుతున్న అధికార యంత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తుందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఉట్నూర్ పట్టణంతో పాటు మండలంలోని షాంపూర్, హస్నాపూర్, లింగోజీతండా, దంతనపల్లిలతో పాటు ఇంద్రవెల్లి, నార్నూర్ మండలాల్లోని పలు ప్రాంతాల్లో ఉన్న హోటళ్లు, దాబాలు, మెస్‌లు, టిఫిన్ సెంటర్లు, టీ సెంటర్లలో సబ్సిడీగ్యాస్ సిలిండర్లను హోటల్ యజమానులు వినియోగిస్తున్నారని తెలుస్తుంది. వ్యాపారం చేసే హోటళ్లు, క్యాంటీన్లలో వాణిజ్య సిలిండర్లను ఉపయోగించాల్సి ఉండగా వాణిజ్య గ్యాస్ సిలిండర్లకు అధిక ధరలు చెల్లించాల్సి వస్తుందని భావిస్తున్న హోటల్ యజమానులు, మిఠాయిల వ్యాపారులు ఇండ్ల అవసరాల కోసం ప్రజలకు సరఫరా చేస్తున్న గృహ అవసరాల సిలీండర్లను వినియోగిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఫలితంగా ప్రభుత్వానికి నష్టం కలగడంతో పాటు ప్రజల అవసరాలకు కూడా సిలీండర్లు లభించడం లేదని, గృహ అవసరాల సిలీండర్లను వ్యాపారులకు ఇస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

జోరుగా కల్తీ ఆహార పదార్థాల విక్రయాలు..!?

ఇదేకాకుండా ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతాలలోని హోటల్స్, మిఠాయి దుకాణాల నిర్వాహకులు కల్తీ వస్తువులు తయారు చేసి భారీగా కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కొందరు స్వీట్ల వ్యాపారులు పాలు కొనుగోలు చేయకుండానే కల్తీ పాలతో స్వీట్లు తయారు చేస్తూ విక్రయిస్తున్నారని తెలుస్తుంది. గ్యాస్ సిలీండర్ల వాడకంపై నిఘా పెటాల్సిన పౌర సరఫరాల అధికారులు ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇదే కాకుండా కల్తీ ఆహారంతో పాటు స్వీట్లు ఆహార పదార్థాలు విక్రయిస్తున్న వారి పై ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఏ మాత్రం తనిఖీలు చేయడం లేదని విమర్శలు వస్తున్నాయి. టిఫిన్ సెంటర్లలో, దాబాలలో, మెస్సులు, హోటళ్లలో కల్తీ ఆహార వస్తువులు ఉపయోగించి ఆహార పదార్థాలు తయారు చేసి జోరుగా విక్రయిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఉట్నూర్ ఏజెన్సీ ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని కల్తీ ఆహార వస్తువుల విక్రయాలను సాగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వంకాయ పంటకు ఎల్లో ఫంగస్

తాంసి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మొన్నటి వరకు ఆశాజనకంగా కనిపించిన వంకాయ సాగుకు ఎల్లో కలర్ ఫంగస్ తెగులు సోకింది. పచ్చగా ఉండాల్సిన పంట పసుపు రంగుకు మారుతుందని సంబంధిత రైతులు పేర్కొంటున్నారు. తాంసి మండల కేంద్రంతో పాటు మండలంలో సుమారు 80 ఎకరాల్లో ఈ కూరగాయల సాగు సాగవుతుంది. ప్రస్తుతం పంట కోతకు వచ్చే సమయంలోనే ఫంగస్ తెగులు సోకడం పట్ల సాగు రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ ఒకపక్క సాగు నీరు కరువవడం, మరో పక్క ఫంగస్ తెగులుతో తమకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు. ఫంగస్ తెగులు నివారణకు చర్యలు తెలపలని మండల రైతులు కోరుతున్నారు


తెగులు సోకిన వంకాయ పంట

ఈ గుంత కనపడడం లేదా.. సారూ..!?

ఇచ్చోడ, ఏప్రిల్, 3 (ఆంధ్రజ్యోతి) : ఇచ్చోడ మండల కేంద్రం నుంచి సిరిచెల్మ వెళ్లే రహదారిపై పెద్ద గుంత తవ్వి వదిలేసి నెలలు గడుస్తున్న అధికారుల కళ్లకు కనిపించడంలేదు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని బీటీ రహదారిపైన భారీ గుంత తవ్వారు. గుంత చుట్టు కనీసం రక్షణ వలయం ఏర్పాటుచేయలేదు. నెలలవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. గుంత పక్కనే మురుగుకాలువ పక్కనే గుంత ఉండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని వాహనదారులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో గుంత కనిపించకపోవడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని అటు వైపు వెళ్లే ప్రయాణికులు జంకుతున్నారు. ఈ వైపు నిత్యం మండల పరిషత్తు అధికారులు, గ్రామ పంచాయతీ అధికారులు ఆ గుండా పయనిస్తున్న వారి కంటికి కనిపించడంలేదా అని వాహనదారులు వాపోతున్నారు. ఇకనైనా సమస్యపై దష్టిసారించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


రోడ్డుపై తవ్విన గుంతను వదిలేసారిలా..

మొక్కల సంరక్షణకు వ్యాపారుల వినూత్న ఆలోచన

ఆదిలాబాద్ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో నిర్మించిన డివైడర్ల మధ్యలో మొక్కలు పెంచుతుండగా పురపాలక సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వాటికి నీరు పోసే కరవయ్యారు. స్థానిక కిసాన్‌చౌక్‌లో ఎండలకు మొక్కలు ఎండిపోతుండడం గమనించిన వ్యాపారులు వినూత్న ఆలోచనతో వాటిని బతికించే ప్రయత్నం చేస్తున్నారు. ఉన్న నీటి వనరులనే పొదుపుగా వాడుకోవాలన్న ఉద్దేశంతో మొక్కలకు వాటర్ బాటిళ్లు కట్టేసి ఒక్కో చుక్కనీరు పడేలా ఏర్పాటు చేశారు. బిందు సేద్యం పద్ధ తిలో మొక్కలకు నీరు అందిస్తూ వాటి సంరక్షణ పై దృష్టి సారించడాన్ని పలువురు అభినందిస్తున్నారు.

●(ఆదిలాబాద్, ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్)


మొక్కలకు నీటి బాటిళ్లను కడుతున్న వ్యాపారులు

ఫొటో న్యూస్




మొక్క అంచున వాటర్ బాటిల్ కట్టి నీటిని వదులుతున్న దృశ్యం

• పోలీసులకు డైరెక్షన్ చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్



అక్రమ దందాలపై కొరడా!







- ఎస్పీ అఖిల్ మహాజన్ వార్నింగ్‌లతో అక్రమార్కుల్లో వణుకు
- వీడీసీల అనధికారిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా
- విచ్చలవిడిగా సాగుతున్న బెల్ట్ దందాలకు చెక్
- నిషేధిత వ్యాపారాలకు అడ్డుకట్ట వేసేందుకు అన్నిరకాల చర్యలు
- మట్కా, గుట్కా, గంజాయి, బెట్టింగ్ లాంటి కార్యకలాపాలపై ఉక్కుపాదం
- నకిలీ పత్తి విత్తన వ్యాపారులపై దృష్టి
- వరుస తనిఖీలతో బెంబేలెత్తిపోతున్న మైనింగ్ మాఫియా
- గీత దాటిన అధికారులపై వేటు తప్పదంటూ వార్నింగ్
- అంతా.. రూల్స్ అండ్ రెగ్యులేషన్ అంటూ హడలెత్తిస్తున్న ఎస్పీ



దుకాణంలో పోలీసులకు పట్టుబడిన మద్యం

ఆదిలాబాద్, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొనసాగుతున్న అక్రమ దందాలపై ఎస్పీ అఖిల్ మహాజన్ కొరడా ఝులిపిస్తున్నారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి విస్తృతంగా పర్యటిస్తూ పోలీసు సిబ్బందిని అలర్టు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లను సందర్శించి అధికారులకు సూచనలు చేస్తూ పాలనను గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లా సరిహద్దుల్లో ఉన్న బోరజ్‌చెక్‌పోస్టు, బేల మండలం శంకర్‌గూడ చెక్‌పోస్టు, బోథ్ మండలం గన్‌పూర్ చెక్‌పోస్టు, తలమడుగు మండలం లక్ష్మీపూర్ చెక్‌పోస్టులను సందర్శించారు. అంతరాష్ట్ర రాకపోకలపై మరింత నిఘా పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. మహారాష్ట్ర నుంచి జిల్లాకు తరలిస్తున్న నిషేధిత వ్యాపారాలకు అడ్డుకట్ట వేసేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా మట్కా, గుట్కా, గంజాయి, బెట్టింగ్ లాంటి కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. వానాకాల సీజన్‌లో రైతులను నట్టేట ముంచుతున్న నకిలీ పత్తి విత్తనాల వ్యాపారులపై దృష్టి సారించారు. ఉట్నూర్‌లో ఆదివాసీలతో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించి వారికి మరింత భరోసాను కల్పించే ప్రయత్నం చేశారు. అలాగే గీత దాటిన అధికారులపై వేటు పడుతుందంటూ హెచ్చరిస్తున్నారు. వార్నింగ్‌లతో ఎస్పీ అఖిల్ మహాజన్ అక్రమ దందాలకు పాల్పడుతున్న వ్యాపారుల గుండెల్లో వణుకు పుట్టిస్తున్నారు. అంతా రూల్స్ అండ్ రెగ్యులేషన్ అంటూ పాలనలో ప్రత్యేక ముద్రను వేసుకుంటున్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ 25 రోజుల పాలనపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

పెరిగి పోతున్న వీడీసీల పెత్తనం..

గ్రామాల్లో వీడీసీల పెత్తనం పెరిగి పోవడంపై ఎస్పీ సీరియస్‌గా దృష్టి సారించారు. జిల్లా ఎస్పీగా పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే వీడీసీల అనధికారిక దందాలపై ఆరా తీస్తున్నారు. జిల్లా సరిహద్దుల్లో ప్రవహిస్తున్న పెన్‌గంగా నది నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక రవాణాకు చెక్ పెడుతున్నారు. నది సరిహద్దుల్లో ఉన్న పలు గ్రామాల వీడీసీలు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడంపై కొరడా ఝులిపించారు. పెన్‌గంగా నదిలో అక్రమంగా ఇసుక రీచ్‌లను వేలం వేస్తూ గ్రామాభివృద్ధి పేరిట లక్షలు దండుకుంటున్న వీడీసీ సభ్యులపై కేసులు నమోదు చేశారు. ఇప్పటికే జైనథ్, బేల మండలాల పరిధిలో 20మందికి పైగా ఇసుక వ్యాపారులు, ట్రాక్టర్ యజమానులు, వీడీసీ సభ్యులపై కేసులు నమోదు చేయడం హాట్‌టాపిక్‌గా మారింది. గ్రామాల్లో వీడీసీ వ్యవస్థ అనేది తరతరాలుగా కొనసాగుతోంది. కానీ అభివృద్ధి పేరిట అడ్డగోలు దందాలకు ఎగబడడం చట్టవ్యతిరేకమంటూ పోలీసులు హెచ్చరికలు చేస్తున్నారు. పలు గ్రామాల్లో వివాదాల పరిష్కారంలోనూ వీడీసీ పెద్దలు తలదూర్చడంపై జిల్లా పోలీసులు చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

షాక్‌లో ఎక్సైజ్ శాఖ..

జిల్లాలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ దుకాణాలపై పోలీసులు దాడులు చేయడంతో ఎక్సైజ్ శాఖ అధికారులు షాక్‌కు గురైనట్లు తెలుస్తోంది. ప్రభుత్వం విధించే టార్గెట్‌లతో మద్యం సేల్స్‌ను పెంచేందుకు ఎక్సైజ్ శాఖాధికారులు పడరాని పాట్లు పడుతున్నారు. అధికారులే బెల్ట్ దుకాణాలకు పరోక్షంగా మద్దతుగా నిలుస్తున్నట్లు సమాచారం. ఇప్పుడిప్పుడే టార్గెట్ గాడిలో పడుతుందన్న సమయంలోనే ఎస్పీ బెల్ట్‌షాపులకు చెక్‌పెట్టేందుకు చర్యలు చేపట్టడం అయోమయ పరిస్థితులకు దారి తీస్తుందంటున్నారు. దాబాల్లోను విచ్చలవిడిగా సాగుతున్న మద్యం దందాను కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టారు. కిరాణా షాపులతో పాటు ఇళ్లలోనూ కొందరు వ్యాపారులు మద్యాన్ని విక్రయిస్తూ అడ్డదారి సంపాదనకు ఎగబడుతున్నారు. దీని వెనక కల్తీ మద్యం కూడా జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. బెల్ట్ మద్యం దుకాణాలను కట్టడి చేస్తేనే దాదాపుగా అన్ని రకాల సమస్యలకు పరిష్కారం చూపవచ్చునని పోలీసులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. కానీ గ్రామాల్లో బెల్ట్‌దుకాణాలను కట్టడి చేస్తే ప్రభుత్వ ఆదాయానికి గండిపడే అవకాశం ఉందంటున్నారు. దీంతో త్వరలోనే ఎక్సైజ్ శాఖాధికారులు ఎస్పీని కలిసి వాస్తవ పరిస్థితులను వివరించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

సైలెంటైనా మైనింగ్ మాఫియా..

పోలీసుల వరుస తనిఖీలతో మైనింగ్ మాఫియా బెంబెలెత్తి పోతున్నారు. మట్టి, మొరం, ఇసుక, ఏదైనా తరలించేందుకు అనుమతులు తప్పనిసరి అంటూ నిబంధనలు విధిస్తున్నారు. పెన్‌గంగా, ఇతర వాగుల్లో నుంచి ఇసుకను తరలిస్తున్న వారి పై కేసులు నమోదు చేస్తున్నారు. అయితే కొందరు అభివృద్ధి పనుల పేరిట అనుమతులు తీసుకుంటు అక్రమదందాలకు పాల్పడుతున్నారు. గతంలో రాత్రి పగలు అనే తేడా లేకుండా జరిగిన మొరం అక్రమ తవ్వకాలకు పోలీసులు అడ్డుకట్ట వేస్తున్నారు. మైనింగ్ తవ్వకాలకు సంబంధిత తహసీల్దార్, మైనింగ్ శాఖ అధికారుల అనుమతులు తప్పనిసరిగా ఉండాలంటూ హెచ్చరికలు చేస్తున్నారు. అక్రమదందాలకు చెక్‌పెట్టడంతో మైనింగ్ వ్యాపారులు రాజకీయ నేతల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఒకటి రెండు సార్లు పట్టుబడిన వారిని జరిమానాతో హెచ్చరించి వదిలేస్తున్నా మూడో సారి పట్టుబడితే జైలుకు వెళ్లాల్సి వస్తుందని వార్నింగ్‌లు ఇస్తున్నారు. దీంతో మైనింగ్ మాఫియా పూర్తిగా సైలెంటైనట్లు కనిపిస్తుంది. ఇటీవల బోరజ్ చెక్‌పోస్టు వద్ద వాహనాలను ఆపేందుకు ప్రయత్నించిన ఓ ప్రైవే ట్ వ్యక్తిపై కేసు నమోదు చేయ డం జిల్లాలో చర్చనీయాంశంగా మారిం ది. అలాగే పెన్‌గంగా నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారి నుంచి వసూలుకు ఎగబడిన ఒక రిద్దరు ప్రైవేట్ వ్యక్తులపై కూడా కేసులు నమోదు చేసిన దాఖలాలు ఉన్నాయి.

అక్రమ దందాలపై ఉక్కుపాదం మోపుతాం..

: అఖిల్ మహాజన్, ఎస్పీ



జిల్లాలో కొనసాగుతున్న అక్రమదందాలపై ఉక్కుపాదం మోపుతాం. ఎంతటి వారైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంతో పాటు బెల్టు షాపులను నడిపే వారిపై చర్యలు తప్పవు. జిల్లాలో ప్రశాంతమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం.



జిల్లాలో వర్షం



జిల్లా కేంద్రంలో కురుస్తున్న వర్షం

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 03 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో గురువారం తెల్లవారుజామున నుంచి మబ్బులు కమ్ముకున్నాయి. దీంతో వాతావరణం పూర్తిగా చల్లబడిది. ఒకేసారి ఉరుములు మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. వాతావరణం ఒకేసారి చల్లబడడంతో ఎండ వేడిమితో ఇబ్బందులు పడుతున్న పట్టణ ప్రజలకు కొంత ఉపశమనం లభించింది. మరోవైపు పలు మండలాల్లో వర్షం కురిసింది.

● చల్లబడిన వాతావరణం

బోథ్ : బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా మండలంలో ఉదయం పూట వర్షం కురిసింది. నిన్నటివరకు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు చిరుజల్లులతో కొంత ఉపశమనం పొందారు.

నేరడిగొండ : వర్షానికి రబీ పంటలైన జొన్న, నువ్వుల పంటలకు స్వల్ప నష్టం వాటిల్లింది. అకాల వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షం సమయంలో చెట్ల వద్ద వ్యవసాయ క్షేత్రాల్లో ఉండవద్దని అధికారులు సూచిస్తున్నారు.

ఇంటి నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయండి

● జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి బసవేశ్వరరావు



నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తలమడుగు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ నమూనా ఇల్లును త్వరగా పూర్తిచేయాలని జిల్లా గృహణ నిర్మాణ శాఖ అధికారి బసవేశ్వర రావు కోరారు. గురువారం ఆయన ఇల్లు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో ఐదు లక్షలతో నమూనా ఇల్లును నిర్మిస్తున్నామన్నారు. ఈ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. నాణ్యమైన ఇసుకతో పాటు సిమెంటును వాడాలని కోరారు. ఇందులో డిప్యూటీ ఏఈ నజీర్, ఎంపీడీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని స్వాముల వినతి

ఉట్నూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కారం హనుమాన్ మందిరంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని అంజనేయ దీక్షా స్వాములు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమబొజ్జుపటేల్‌ను కోరారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేని కలిసి ఘనంగా సన్మానించారు.త్వరలో జరగనున్న హనుమాన్ జయంతి వేడుకలకు రావాల్సిందిగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా లక్కారమ్ అంజనేయ దేవాలయంలో కొన్ని సౌకర్యాలు, భక్తులకు సన్నిధి, బాత్‌రూమ్‌లు ఒక షెడ్ మంజూరు చేయాలని కోరగా ఎమ్మెల్యే వెడమబొజ్జుపటేల్ సానుకూలంగా స్పందించి త్వరలో అన్ని సౌకర్యాలు కల్పిస్తానన్నారన్నారు. కార్యక్రమంలో గురుస్వామి గొల్లపల్లి శ్రీనివాస్, ఆత్రం తిరుపతి, అరకిల్ల అశోక్, దత్తస్వామి, రాజుస్వామి, బాలు, రాకేష్ తదితరులు అంజనేయ దీక్ష స్వాములు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత....

మండల కేంద్రంలోని వేణునగర్ కాలనీకి చెందిన ఆర్‌పీ లత కుటుంబసభ్యులకు ఉట్నూర్‌లోని తనక్యాంపు కార్యాలయంలో ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్ రూ.27వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ పథకం వల్ల ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు.

నమూనా పరీక్షలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 03 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎంసెట్ ఫౌండేషన్ కోర్స్ బ్యాచ్‌ని సందర్శించి, బీసీ స్టడీ సర్కిల్ ఆదిలాబాద్ ఇంటర్మీడియట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 30 నమూనా పరీక్షలను జిల్లా కలెక్టర్ రాజర్షిషా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎంసెట్ ఫౌండేషన్ కోర్స్ బ్యాచ్‌ను సందర్శించి ప్రతిఅభ్యర్థి ఒక పట్టుదల క్రమశిక్షణ తీవ్రతవనతో మంచి ప్రణాళికతో కష్టపడి యూనివర్సిటీలో సీటు సాధించాలని పలుసూచనలు, సలహాలు చేశారు. అదేవిధంగా బీసీ స్టడీసర్కిల్ ఆదిలాబాద్ ఇంటర్మీడియట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 30 నమూనా పరీక్షలు పరిశీలించి మంచిగా రాయాలని తెలిపారు. రోజు ఒక నమూనా పరీక్ష 30 రోజుల పాటుగా రాయడం వలన ప్రతి అభ్యర్థికి మంచి అవగాహన కలిగి ఎంసెట్‌లో మంచి ఫలితాలు సాధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డీఐఈఓ గణేష్ జాదవ్, ఫ్యాకల్టీ సిబ్బంది ఎం సెట్ శిక్షణ తీసుకున్న విద్యార్థులు పాల్గొన్నారు.

మహానీయుల స్ఫూర్తి కొనసాగిస్తూ ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ దొడ్డి కొమురయ్య జయంతిని అధికారికంగా నిర్వహించారు. దీనికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై కొమురయ్య చిత్రపటానికి అధికారులు, నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గొల్ల కుర్మల సమస్యలను తెలుసుకున్నారు. గొర్రెల పంపిణీ చేయాలని, కొమురయ్య విగ్రహం ఏర్పాటు చేయాలని, ప్రత్యేకంగా గొల్ల కుర్మలకు హాస్టళ్లను నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలతో పాటు రైతుల కోసం కొమురయ్య ఉద్యమించారన్నారు. 19 ఏటలోనే భూస్వాములు, రజాకర్లకు వ్యతిరేకంగా ఉద్యమించారన్నారు. రైతులు, బడుగుబలహీన వర్గాలను ఆయన చైతన్యపర్చారని తెలిపారు. కొమురయ్య ఉద్యమ స్ఫూర్తితోనే తెలంగాణ సాయుధ పోరాటం ప్రారంభమైందని గుర్తుచేశారు. గొల్లకుర్మలు వారి సమస్యలను తెలియజేశారన్నారు. వాటి పరిష్కారం కోసం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానన్నారు. అదే విధంగా పట్టణంలోని బస్టాండ్ ఎదుట దొడ్డి కొమురయ్య విగ్రహ ఏర్పాటుకు నాయకులు కూడా మంత్రికి విన్నవించాలన్నారు. బడుగు బలహీనవర్గాల కోసం పోరాటం చేసిన దొడ్డి కొమురయ్య సేవలను ప్రతి ఒక్కరు మననం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఆర్డీవో వినోద్ కుమార్, బీసీ వెల్ఫేర్ అధికారి రాజలింగు, గొల్లకుర్మ సంఘం నాయకులు గోవర్ధన్, రాజు యాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన



ఆశీర్వదిస్తున్న లింబా మహారాజ్

నేరడిగొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకరపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన అంజనేయ ఆలయంలో గురువారం లింబాజీ మహారాజ్‌తో పాటు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌లు విగ్రహ ప్రతిష్ఠాపన, శిఖర పూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆడేగజేందర్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కోసం ఐదు లక్షలు రూపాయలతో షెడ్‌నిర్మాణం, భక్తుల సౌకర్యం కోసం బోర్ వేయిస్తానని అన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లెక్చరర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, ఆయా గ్రామాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోర్టులో చలివేంద్రం ఏర్పాటు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 03 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో కోర్టుకు వచ్చే కక్షిదారుల కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా ప్రధానన్యాయాధికారి ప్రభాకర్‌రావు అన్నారు. డీఎల్ఎస్ఏ, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గురువారం జిల్లా ప్రధాన న్యాయాధికారి ప్రభాకర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం న్యాయవాదులకు నీటిని అందించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధానన్యాయాధికారి ప్రభాకర్ రావు మాట్లాడుతూ.. వేసవిలో రాష్ట్రంలోనే ఆదిలాబాద్‌లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ సమయంలో కోర్టుకు వచ్చే కక్షిదారులు తాగునీటికి ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంతో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కక్షిదారులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయాధికారి ప్రమీల జైన్, డీఎల్ ఎస్ఏ కార్యదర్శి సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్రాల నగేష్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన సదస్సు

బోథ్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్టీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో గురువారం బాలికలకు చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం నేరమన్నారు.

విద్యార్థులకు క్రీడా పరికరాల అందజేత

ఉట్నూర్, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొమురం భీం ప్రాంగణంలో ఉన్న ప్రత్యేక అవసరాలు గల వికాసం పాఠశాల విద్యార్థులకు రూ.లక్ష విలువ చేసే క్రీడా పరికరాలను రిజర్వు పోలీసు అధికారులు విరాళంగా అందించారు. గురువారం వికాసం పాఠశాలను సందర్శించి ఆదిలాబాద్ జిల్లాలోని రెండోబెటాలియన్ తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీసుల ఆధ్వర్యంలో లక్ష రూపాయలు విలువ గల క్రీడా పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఎ.జయప్రకాష్ నారాయణ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేల కృషితో ఎయిర్‌పోర్ట్‌కు ఎన్‌వోసీ

● బీజేపీ జిల్లా అధ్యక్షులు బ్రహ్మనంద్

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 03 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ ప్రజల చిరకాల వాంఛ అయిన ఎయిర్‌పోర్ట్‌కు ఎన్‌ఓసీ వచ్చేలా ఎంపీ, ఎమ్మెల్యేలు కృషి చేశారని బీజేపీ జిల్లా అధ్యక్షులు బ్రహ్మనంద్ అన్నారు. గురువారం వినాయక్‌చౌక్ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్ చిత్రాలతో కూడిన ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. మోడీ, ఎంపీ, ఎమ్మెల్యేలకు అనుకూల నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు బ్రహ్మనంద్ మాట్లాడుతూ... ఆదిలాబాద్ ఏండ్ల నుంచి ఏయిర్‌పోర్టు కోసం ఎదురు చూస్తుందన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలు నిత్యం దీనిపై కేంద్ర మంత్రులను కలిసి ఇక్కడి సమస్యలను తెలియజేయడంతో ఎయిర్‌పోర్ట్‌కు ఎన్‌ఓసీ వచ్చిందన్నారు. త్వరలోనే పనులు కూడా ప్రారంభమవుతాయన్నారు. ఎయిర్‌పోర్ట్ వస్తే పరిశ్రమలు స్థాపనకు ఎన్నో అవకాశాలుంటాయన్నారు. యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. ఎయిర్‌పోర్ట్‌కు ఎన్‌ఓసీ వచ్చేలా కృషి చేసిన ఎంపీ, ఎమ్మెల్యేలకు ప్రజల తరపున ధన్యవాదలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వేదావ్యాస్, మహేందర్, ఆకుల ప్రవీణ్, స్వప్న, జోగు రవి, అస్తక్ సుభాష్, విజయ్ బోయర్ పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన



రోడ్డుపై కూర్చొని నిరసన తెలుపుతున్న నాయకులు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 03 (ఆంధ్రజ్యోతి) : రైతులను కించపరిచే విధంగా ట్రాఫిక్ పోలీసులు వ్యవహరిస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షులు బ్రహ్మనంద్ అన్నారు. పోలీసుల తీరును నిరసిస్తూ గురువారం ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తు హోరెత్తించారు. టూటౌన్ సీఐ కరుణకర్‌రావు అక్కడికి చేరుకొని సముదాయించారు. వారిని ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు బ్రహ్మనంద్ మాట్లాడుతూ.. ఇచ్చోడ మండలానికి చెందిన రైతుమాధవ్ తన తల్లిని రిమ్స్‌లో అడ్మిట్ చేశారన్నారు. మందుల కోసం వెళ్తున్న సమయంలో కలెక్టర్ చౌరస్తా వద్ద అపారన్నారు. అయితే తన వాహనంపై ఉన్న ఫైన్స్ కట్టిస్తానని చెప్పినా ట్రాఫిక్ పోలీసులు వినిపించుకోలేదన్నారు. రైతు తరఫున మాట్లాడడానికి వచ్చిన తనతో కూడా దురుసుగా వ్యవహరించారన్నారు. పోలీసులు మాట్లాడే తీరును మార్చుకోవాలన్నారు. చలాన్‌లపై ఉన్న శ్రద్ధ అంబేద్కర్ చౌక్, గాంధీచౌక్, శివాజీచౌక్‌లో ట్రాఫిక్‌సమస్య తీర్చడంలో లేదన్నారు.

వాయుసేన అనుమతులు ఇవ్వడం శుభపరిణామం

● డీసీసీబీ డైరెక్టర్

ఆదిలాబాద్‌అర్బన్, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు భారత వాయుసేన నుంచి అనుమతులు రావడం శుభపరిణామమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1930లోనే ఇక్కడ నిజాంకాలంలో యుద్ధవిమానాలు ఇంధనం నింపు కోవడం కోసం దిగేవని అన్నారు. 2009లో అప్పటి ఎంపీ జైరాంరమేష్ చొరవతో ఎయిర్ పోర్టుపై ఆశలు చిగురించాయని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో దీనికి ఒక్కడుగు కూడా ముందుకు పడలేదన్నారు. ఎయిర్‌పోర్టు విషయంలో అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి, ఎమ్మెల్యే జోగురామన్న పట్టించుకోక ఆదిలాబాద్‌కు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదిలాబాద్‌ను దత్తత తీసుకుని అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాకు ఎయిర్‌పోర్టు తెస్తానని ఇటీవల అసెంబ్లీ సవ వేశాలలో ప్రకటించి కేంద్ర విమానయాన శాఖతో సంప్రదింపులు జరిపి అనుమతులు తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. ఇందులో నాయకులు బండారి సతీష్, మునిగెల నర్సింగ్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న బాలూరిగోవర్ధన్‌రెడ్డి

'రుణమాఫీపై స్పష్టత లేదు'

బోథ్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని, ఇంత వరకు ఆదిలాబాద్ జిల్లాలో లక్షా 371 మంది రైతులకు మాత్రమే రైతు భరోసా నిధులు వచ్చాయని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగేపు బొర్రన్న పేర్కొన్నారు. న్నారు. ఇంకా రైతుభరోసా రావాల్సిన రైతులు 62,978 మంది ఉన్నారన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను కాలయాపన చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. మరోవైపు 27,432 మంది రైతులకు రుణమాఫీ రాలేదని విమర్శించారు.